బుధవారం
20మే 2026
సంపుటి: 18 సంచిక:118
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by:Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari, Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com

స్థాపితం : 2008

RNI No. APTEL/2008/24928Postal
Registration No.: VZM/22/2020-2022
Period of Renewal

# ప్రజాస్వామ్యం
తెలుగు దినపత్రిక

PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)

## పాతాళానికి రూ'పాయె'!

డాలర్‌తో పోలిస్తే అత్యంత కనిష్ఠానికి పతనం


రికార్డు స్థాయిలో 96.53కి చేరిక - నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



2 లో

## పట్టణాల్లో హై అలర్ట్

తీవ్ర వడగాడ్పుల పట్ల ప్రభుత్వం హెచ్చరికలు





అమరావతి : పట్టణాల్లో ఉష్ణోగ్రతలు పెరగడంతోపాటు తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్లకు పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. తీరప్రాంత జిల్లాల్లో తీవ్ర వడగాడ్పులపై ప్రభుత్వం హై అలర్ట్ ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి 26 వరకూ వడగాడ్పుల తీవ్రత పెరుగుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. ముఖ్యంగా మధ్య, ఉత్తర కోస్తా జిల్లాల మున్సిపల్ అధికారులు అలర్ట్‌గా ఉండాలని ఆదేశించారు.బస్టాండ్లు, మార్కెట్లు, అన్న క్యాంటీన్ల దగ్గర తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే పగటి వేళల్లో మున్సిపల్ పనులను నిలిపివేయాలని, పారిశుధ్య కార్మికులు, కూలీలు, వీధి వ్యాపారులు, వృద్ధుల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రజల అత్యవసర సేవలు, ఫిర్యాదుల కోసం మున్సిపల్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు.

# మత్స్య సంపద ఎగుమతుల్లో అగ్రగామిగా ఎపి

-మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం రూ.261కోట్లు నిధులు విడుదల

- అన్నం తగ్గించి చేపలు తినండ- తుమ్మలపెంట సభలో సిఎం చంద్రబాబు



నెల్లూరు : మత్స్య సంపద ఎగుమతుల్లో ఎపిని అగ్రగామిగా నిలుపుతామని, మత్స్యకారులు జీవితాల్లో వెలుగు నింపే బాధ్యత తనదేనని, ఎవరూ అధైర్య పడొద్దని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. మంగళవారం నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం తుమ్మలపెంటలో జరిగిన 'మత్స్యకారుల సేవ-లో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేట నిషేధ పరిహారం కింద రాష్ట్రంలోని 1.30 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.261 కోట్లు విడుదల చేశారు. ఒక్కో కుటుంబానికీ రూ.20 వేల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. చంద్రబాబునాయుడు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మత్స్యకారుల వేటలో సాంకేతిక విప్లవం రానున్నదన్నారు. శాటిలైట్ ద్వారా ఎక్కడ మత్స్య సంపద ఉందనేది నేరుగా మత్స్యకారులకు చేరే విధంగా చేస్తున్నామని తెలిపారు. అప్పుడు ఉత్పత్తి అత్యధికంగా పెరుగుతుందన్నారు. ఎపికి సుమారు వెయ్యి కిలో మీటర్ల సముద్రం ఉందని, తమిళనాడు, ఇతర ప్రాంతాల నుంచి మత్స్యకారులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పెట్రోలింగ్ కోసం నెల్లూరు జిల్లాకు నాలుగు బోట్లు కొనుగోలు చేశామన్నారు. మత్స్యకారులకు 200 మెకనైజ్డ్ బోట్లు కొనుగోలు కోసం రానున్న రోజుల్లో 60 శాతం సబ్సిడీ ఇస్తామన్నారు. ఇక్కడి నుంచి విదేశాలకు చేపలు ఎగుమతి అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎపి నుంచే అత్యధికంగా ఎగుమతులు చేసి మత్స్యకారుల జీవితాల్లో వెలుగు తీసుకొస్తామన్నారు. సముద్రంలో అందులో దొరికే చేపలు, వేట అంతా మత్స్యకారుల సొంతమని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మత్స్యకారుడికీ సొంత ఇల్లు, నిర్మాణం తమ బాధ్యతన్నారు. ఏట ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు వేట నిషేద సమయంలో కేవలం రూ.4 వేలు ఇస్తున్నదాన్ని ప్రస్తుతం రూ.20 వేలకు పెంచింది టిడిపియేనన్నారు. నెల్లూరు జిల్లాలోని జువ్వలదిన్నెలోని ఫిషింగ్ హార్బరును సాగర్ రక్షణ శాఖకు ఇస్తారని వైసిపి చేస్తోన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవమూ లేదని వివరించారు. అది దేశ రక్షణకు సంబంధించిన ప్రాజెక్టు అని, అందులో పనిచేయడానికి మత్స్యకారుల పిల్లలకు శిక్షణిచ్చి నియమిస్తామ న్నారు. ఇప్పుడు వైట్ రైస్ తినడం వల్ల కార్బోహైడ్రేడ్లు పెరిగి సుగర్ వంటి జబ్బులు వస్తున్నాయని, చేపల్లో ఎక్కువ ప్రొటీన్ ఉంటుందని, దీనిని తినడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని చంద్రబాబు తెలిపారు. ఎక్కువ మంది చేపలు తినడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చేపల వేట సమయంలో సముద్ర నాచు దొరుకు తుందని, ఇది ఎంతో ముఖ్యమైన దన్నారు. ఎక్కడైనా నీటి ద్వారానే నాగరికత వచ్చిందని, విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, రాజమండ్రి నగరాలు నదులు ఉన్నందున బాగా అభివృద్ధి చెందాయని వివరించారు. ఎపి సముద్ర తీరాన్ని పర్యటక కేంద్రాలుగా మార్చడానికి ఏర్పాట్లు చేస్తున్నామని, బీచ్ లు అభివృద్ధి చెందడం వల్ల విదేశీ పర్యాటకులు మన

వివరాలు2లో..

# ఇంధన ధరలు 90 పైసలు పెంపు

- రెండోసారి పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు
- పెరిగిన ధరలు తక్షణం అమలులోకి
  నాలుగు రోజుల వ్యవధిలో రూ.3.90 వడ్డన
- దేశావ్యాప్తంగా వాహనదారుల గగ్గోలు
- హైదరాబాద్‌లో ఈ నెల
  14న లీటర్ పెట్రోల్ ధర రూ.107.45
- ప్రస్తుత ధర రూ.111.88




న్యూఢిల్లీ, మే 19: పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరిగాయి. ఈనెల 15న లీటర్‌కు రూ.3 చొప్పున పెంచుకునేందుకు ఆయిల్ కంపెనీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, మంగళవారం లీటర్‌కు మరో 90 పైసలు పెంచుకునేందుకూ అనుమతించింది. పెరిగిన ధరలు తక్షణం అమలులోకి వచ్చాయి. తాజాగా ధరల పెంపు తర్వాత కూడా చమురు సంస్థలు రోజుకు రూ.750 కోట్ల మేర నష్టాన్ని చవిచూశాయి. కేంద్రం ఇంధనంపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించినప్పటికీ కంపెనీలకు నష్టాల నుంచి ఉపశమనం కలుగలేదుదీంతో కేంద్రం రెండోసారి కూడా ధరల పెంపునకు అవకాశం ఇచ్చింది. నాలుగు రోజుల వ్యవధిలో రెండుసార్లు ఇంధన ధరలు పెరగడంతో దేశవ్యాప్తంగా వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు (క్రూడ్ ఆయిల్) ధరలు పెరిగాయి. ప్రస్తుతం ఒక బ్యారెల్ ముడి చమురు ధర 110 డాలర్లకు పైగా పలుకుతున్నది. హోర్ముజ్ జలసంధి గుండా రవాణా నిలిచిపోవడం ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం చూపించిందిఈ సంక్షోభం కారణంగా దేశీయంగా దిగుమతి ఖర్చులు బాగా పెరిగాయి. దీంతో వాహనదారులపై భారం పడకుండా ఆయిల్ కంపెనీలే కొద్దిరోజులు నష్టాలను భరిస్తూ వచ్చాయి. కంపెనీలు ఒత్తిడి

వివరాలు2లో..

# ఆలయాల బంగారంపై గోల్డ్ బాండ్లు అవాస్తవం

కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ



న్యూఢిల్లీ, : హిందూ దేవాలయాలు, మతపరమైన దేవాదాయ సంస్థల నియంత్రణ చట్టాల రాజ్యాంగ చెల్లుబాటుపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి ప్రభుత్వాలు తీసుకొచ్చిన దేవాదాయ చట్టాల్లోని నిబంధనలపై మెరిట్స్ ఆధారంగా తామే విచారణ జరుపుతామని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో పిటిషనర్లు ఆయా రాష్ట్రాల హైకోర్టులను ఆశ్రయించాలంటూ 2025ఏప్రిల్‌లో ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకుంది. గత ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన రివ్యూ పిటిషన్లపై విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మల ధర్మాసనం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు దేవాలయాల నిర్వహణలో జోక్యం చేసుకునేలా తీసుకొచ్చిన చట్టాలను (ఏపీ-1987, తెలంగాణ-1987, తమిళనాడు-1959, పుదుచ్చేరి-1972) సవాల్ చేస్తూ 2012లో సుప్రీంకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. అయితే, ఒక్కో రాష్ట్ర చట్టం ఒక్కో రకంగా ఉండే అవకాశం ఉన్నందున హైకోర్టులే వీటిని విచారించడం మంచిదని 2025లో సుప్రీంకోర్టు పేర్కొంది. నాటి ఆదేశాలపై దాఖలైన రివ్యూ పిటిషన్ల విచారణ సందర్భంగా పిటిషనర్లు బలమైన వాదనలు వినిపించారు. దక్షిణాది రాష్ట్రాల దేవాదాయ చట్టాలు వేర్వేరుగా ఉన్నాయన్న కోర్టు అంచనా సరికాదన్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర దేవాదాయ చట్టాల ఆధారంగానే ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి చట్టాలు రూపొందాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కార్యనిర్వాహక అధికారు (ఈవో)ల నియామకం, కమిషనర్ల అధికారాలు, ఆలయ నిధుల మళ్లింపు, ఫీజుల వసూలు వంటి కీలక నిబంధనలన్నీ ఈ నాలుగు చట్టాల్లోనూ ఒకేలా ఉన్నాయని వివరించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి దేవాదాయ చట్టాల్లోని పలు నిబంధనలు

వివరాలు2లో..

# ప్రమాదకర కుక్కలను నిర్మూలించవచ్చు !

రద్దీ ప్రాంతాల నుంచి వీధి కుక్కలను తరలించాలి -స్టెరిలైజేషన్, వాక్సినేషన్ చేయించినా -సరే.. భారత అత్యున్నత న్యాయస్థానం తుది తీర్పు



న్యూఢిల్లీ, మే 19: వీధికుక్కల వల్ల సామాన్య ప్రజలకు గాయాలైనా, హాని లేదా నష్టం జరిగితే.. దానికి సంబంధించిన న్యాయపరమైన బాధ్యతను తీసుకునేం దుకు జంతుప్రేమికులు, జంతు సంక్షేమ సంస్థలు, ఎన్జీవోలు సిద్ధమేనా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. బహిరంగ ప్రదేశాల్లో ఉండే వీధి కుక్కలను రక్షించే హక్కు తమకుందని ఎవరైనా వాదిస్తే.. తమ చర్యల వల్ల ఇతరులకు ఎలాంటి హానీ జరగకుండా చూడాల్సిన బాధ్యత నుంచి వారు వేరుపడలేరని స్పష్టం చేసింది. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో ఉండే వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలంటూ గతంలో ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను తోసిపుచ్చుతూ.. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన ధర్మాసనం మంగళవారం 131 పేజీల తీర్పునిచ్చింది. వీధి కుక్కల భయం లేకుండా స్వేచ్ఛగా తిరగగలగడం అనేది ప్రజలు గౌరవంగా జీవించే హక్కు కిందికి వస్తుందని అందులో స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా ఎంతోమంది పిల్లలు, వృద్ధులు అంతర్జాతీయ పర్యాటకులు కుక్కకాటుకు గురవుతున్నారని.. కఠినమైన ఈ క్షేత్రస్థాయి వాస్తవాలను

వివరాలు2లో..

## ముగిసిన మోదీ నార్వే పర్యటన

భారత్ -నార్డిక్ శిఖరాగ్ర సదస్సుకు హాజరు


తదుపరి ఇటలీ రాజధాని రోమ్‌కు ప్రయాణం



ఓస్లో, మే 19: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం తన నార్వే పర్యటనను విజయవంతంగా ముగించుకున్నారు. ఆ దేశ రాజధాని ఓస్లోలో జరిగిన మూడో భారత్ -నార్డిక్ శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీకి ప్రవాస భారతీయులు ఘనస్వాగతం పలికారు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా కళాకా రులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆహ్వానించారు. మోదీ అనంతరం ఆ దేశ ప్రధాని జోనాస్ గహర్ స్టోర్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.గ్రీన్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ తదితర అంశాలపై చర్చలు సాగాయి. గడిచిన పదేళ్లలో నార్డిక్ దేశాలతో భారత ద్వైపాక్షిక వాణిజ్యం నాలుగు రెట్లు పెరిగిందని ప్రధాని మోదీ గుర్తుచేశారు. అనంతరం ఓస్లో నుంచి ప్రధాని మోదీ ఇటలీ రాజధాని రోమ్‌కు బయల్దేరివెళ్లారు.

## చమురు కొనుగోళ్లకు గడువు పెంపు

భారత్‌కు ట్రంప్ మినహాయింపులు



2 లో

# ముగిసిన మోదీ నార్వే పర్యటన

ఇంతకు ముందెన్నడూ చూడని సంక్షోభాన్ని చూస్తాం

సంక్షోభం గురించే తెలిసే ప్రధాని మోదీ పొదుపు మంత్రం

ఉద్యోగులు, చిరువ్యాపారులు, రైతులు కుదుపులకు సిద్ధంగా ఉండాలి

దేశ పౌరులకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ హెచ్చరికలు



న్యూఢిల్లీ, మే 19: భారత్ వైపు ఒక పెద్ద ఆర్థిక తుపాను దూసుకువస్తున్నదని, జీవితంలో ఇంతకముందున్నెడూ చూడని ఆర్థిక సంక్షోభం చూడబోతున్నామని ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ జోస్యం చెప్పారు. ఆర్థిక సంక్షోభం గురించి తెలిసే ఇటీవల ప్రధాని

వివరాలు2లో..

# పాతాళానికి రూ'పాయె'!

ముంబై, మే 19: అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ జీవితకాల కనిష్ఠానికి పడిపోయింది. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో రూపాయి బలహీనపడి రికార్డు స్థాయిలో రూ.96.53కి చేరింది. ముడిచమురు ధరల పెరుగుదల, అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితులు స్టాక్‌మార్కెట్‌ను కుదిపేశాయి. ఐటీ షేర్లు కాస్త నిలకడగా ఉన్నప్పటికీ, ప్రైవేట్ బ్యాంకులు, ఇతర కంపెనీల షేర్లు పతనమయ్యాయి. చివరికి సెన్సెక్స్ 114.19 పాయింట్లు నష్టపోయి.. 75,200.85 వద్ద స్థిరపడింది.నిఫ్టీ 31.95 పాయింట్లు క్షీణించి 23,618.00 వద్ద ముగిసింది. రంగాల వారీగా చూస్తే ఐటీ సూచీ 3 శాతానికి పైగా పెరిగింది. ఇన్ఫోసిస్ దాదాపు 5 శాతం లాభపడింది. హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, టీసీఎస్ మోస్తరు లాభాలను ఆర్జించాయి. ఇంధన ధరల పెరుగుదలతో ప్రభుత్వ రంగ చమురు సంస్థ హెచ్‌పీసీఎల్ లాభాలు 3 శాతం పెరిగాయి. మరోవైపు, ప్రైవేట్ బ్యాంకింగ్ రంగానికి చెందిన కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.5 శాతం మేర నష్టపోయింది.

# ముగిసిన మోదీ నార్వే పర్యటన

మొదటి పేజి తరువాయి

మోదీ దేశప్రజలకు పొదుపు మంత్రం వల్లెవేశారని అభిప్రాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ జిల్లా బచ్‌రావన్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ద్రవ్యోల్బణం ముందెన్నడూ నమోదు కానంత నమోదవుతుందని అంచనా వేశారురానున్న ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకునేందుకు యువత, రైతులు, చిరువ్యాపారులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. భారతీయులు విదేశీ ప్రయాణాలు చేయవద్దని హితబోధ చేసిన ప్రధాని మోదీనే, ఇప్పుడు విదేశీ పర్యటనలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఎవరూ బంగారం కొనవద్దని, ఎలక్ట్రిక్ వాహనాలు కొనాలని చెబుతూ ప్రధాని మాత్రం విలాసవంతమైన ఫ్లైట్లలో విదేశాలకు ఎగిరిపోతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పక్కా ప్రణాళికలు ఇంధన ధరలు పెరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు.ఇలాంటి సంక్షోభ సమయాల్లో కేంద్రం ప్రజల వైపు నిలబడదని, వారి అండదండలు ఖచ్చితంగా కార్పొరేట్ శక్తులైన అంబానీ, అదానీలకే ఉంటాయని దు య్యబట్టారు. ఉద్యోగులు, చిరువ్యాపారులు, రైతుల్ని కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉందని, కానీ.. కేంద్రం మాత్రం ఉదాసీనతే ప్రదర్శిస్తూ వస్తున్నదని విమర్శించారు.

# ఆలయాల బంగారంపై గోల్డ్ బాండ్లు అవాస్తవం

మొదటి పేజి తరువాయి

రాజ్యాంగంలోని పలు అధికరణలను తీవ్రంగా ఉల్లంఘిస్తున్నాయని తెలిపారు. గతంలో 'షిరూర్ మఠం' కేసులో మద్రాస్ దేవాదాయ చట్టంలోని పలు నిబంధనలను న్యాయస్థానం కొట్టివేసినప్పటికీ, ప్రభుత్వాలు వాటినే మళ్లీ కొత్త చట్టాల్లో చేర్చాయని ఆరోపించారు.

# చమురు కొనుగోళ్లకు గడువు పెంపు

న్యూఢిల్లీ, మే 19: రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోలు చేసేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి వెసులు బాటు కల్పించారు. ట్రంప్ గత నిర్ణయం ప్రకారం ఈ నెల 16తో రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను నిలిపివేయాల్సి ఉంది. కానీ, పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతుండటం, చమురు సరఫరాకు ఆటం కాలు కలుగుతుండటం వల్ల ఆ గడువును జూన్ 17 వరకు పొడిగించారు. ట్రంప్ నిర్ణయాన్ని మంగళవారం ఆ దేశపు ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ ధ్రువీకరించారు.ఈ నిర్ణయంతో దేశీయ రిఫైనరీలు రష్యా నుంచి సునాయాసంగా చమురు దిగుమతి చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. అ యితే.. అమెరికా మినహాయింపులతో తమకేమీ సంబంధం లేదని, దీనిలో భాగంగానే తాము ఇప్పటికే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామని భారత ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించడం గమనార్హం.

## నేడు దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్




థానే : దేశవ్యాప్తంగా బుధవారం మెడికల్ షాపులు బంద్ కానున్నాయి. ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (ఎఐఒసిడి) పిలుపు మేరకు 20న బంద్ పాటించనున్నట్లు పేర్కొన్నాయి. సుమారు 15 లక్షలకు పైగా కెమిస్టులు, డ్రగ్గిస్టులు ఈ బంద్ లో పాల్గొననున్నారు. ఆన్ లైన్ లో మందుల విక్రయాలను నిలిపివేయాలని, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను నియంత్రించాలని, నకిలీ మందుల అమ్మకాలను నివారించాలని డిమాండ్ చేస్తూ బంద్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ఆన్ లైన్ లో మందుల విక్రయాలకు కేంద్రం అనుమతించిం దని, ఏళ్లు గడిచినా నోటిఫికేషన్ ను వెనక్కు తీసుకోలేదని ఎఐఒసిడి అధ్యక్షుడు జగన్నాథ్ షిండే తెలిపారు. థానేలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ కంపెనీలు కేంద్రం ఇచ్చిన సడలింపులను దుర్వినియోగం చేస్తూ, 20 నుంచి 50 శాతం వరకు డిస్కౌంట్లు ఇవ్వడంతో అనైతిక పోటీ నెలకొందని అన్నారు. ఈ ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆన్ లైన్ విక్రయాల కారణంగా నకిలీ మందులు, యాంటి బయాటిక్స్, ప్రిస్క్రిప్షన్ లేని మందులు చెలామణి లోకి వచ్చాయని, ఇది ప్రజారోగ్యానికి, ముఖ్యంగా యువతకు తీవ్ర ముప్పును కలిగిస్తున్నాయని తెలిపారు.

# మత్స్య సంపద ఎగుమతుల్లో అగ్రగామిగా ఎపి

మొదటి పేజి తరువాయి

రాష్ట్రానికి వస్తారని తెలిపారు. అక్వా రంగానికి రూ.1.80 కరెంట్ ఇవ్వడం ద్వారా రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. రాయలసీమ డిఫెన్స్, స్పేస్, ఆగ్రో పరిశ్రమల హబ్ గా మారుతుందని పేర్కొన్నారు. తిరుపతి వద్ద బుల్లెట్ తయారీ కంపెనీ వచ్చిందని, 18 నెలల్లో ఉత్పత్తి ప్రారంభం అవుతుందన్నారు. మత్స్యకారులనే కాదు చేనేత కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని తెలిపారు. తుమ్మలపెంటను ఆదర్శ గ్రామం చేస్తామని, రామాయపట్నం పోర్టు పూర్తి చేసి అందిస్తామన్నారు. నెల్లూరు జిల్లాకు కేవలం 50 రోజుల్లోనే రూ.10 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ప్రపంచంలో జరుగుతోన్న యుద్ధం కారణంగా పెట్రో ధరలు పెరిగాయని, ఎరువులు, గ్యాస్ సమస్య ఉందన్నారు. తక్కువ వాడకం వల్ల ప్రయోజనం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు కె. అచ్చెన్నాయుడు, సిఎండి ఫరూక్, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి, ఎంఎల్ సి బీద రవిచంద్ర, ఎంఎల్‌ఎలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కాకర్ల సురేష్, కలెక్టర్ హిమాన్షు శుక్లా, తదితరులు పాల్గొన్నారు. సభలో మత్స్యకారులకు ముఖ్యమంత్రి చెక్కులు పంపిణీ చేశారు.

# ఇంధన ధరలు 90 పైసలు పెంపు

మొదటి పేజి తరువాయి

తీసుకువచ్చినప్పటికీ, ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల కారణంగా కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరల పెంపు నిర్ణయాన్ని వాయిదా వేస్తూ వచ్చింది. ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో కేంద్రం ధరల పెంపునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దేశ పౌరులంతా పొదుపు మంత్రం పాటించాలని, దీనిలో భాగంగానే ఇంధనాన్ని పొదుపు వాడుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చిన కొద్దిరోజులకే ఇంధన ధరలు పెరగడం గమనార్హంతెలంగాణపై ప్రభావంపెరిగిన ఇంధన ధరల ప్రభావం తెలంగాణపైనా పడుతున్నది. ఈనెల 14 వరకు హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర 107.45, లీటర్ డీజిల్ ధర రూ.95.70గా నమోదైంది. మరుసటి రోజు రూ.3 చొప్పున ఇంధన ధరలు పెరిగాక లీటర్ పెట్రోల్ ధర రూ.110.89, లీటర్ డీజిల్ ధర రూ.98.90కు చేరుకుంది. మంగళవారం 90 పైసల మేర ఇంధన ధరలు పెరిగాక లీటర్ పెట్రోల్ ధర రూ.111.88 ఎగబాకింది. లీటర్ డీజిల్ ధర రూ.99.95 మార్కుకు చేరుకుంది అలాగే, ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర ప్రస్తుతం రూ.98.64, డీజిల్ ధర రూ.91.58కు చేరకున్నది. కేంద్రం విధించే విలువ ఆధారిత పన్ను (వ్యాట్) వ్యత్యాసాల వల్ల రాష్ట్రాల మధ్య ధరల వ్యత్యాసాలు ఉంటాయి. ఈ కారణంగానే దేశంలో ఏ రెండు రాష్ట్రాల్లోనూ ఒకే రకమైన ఇంధన ధరలు అమలు కావు.

# ప్రమాదకర కుక్కలను నిర్మూలించవచ్చు !

మొదటి పేజి తరువాయి

తాము విస్మరించలేమని పేర్కొంది. వీధి కుక్కల బెడదను నివారించేందుకు వాటిని జనసమ్మర్థ ప్రదేశాల నుంచి షెల్టర్లకు తరలించాలంటూ సుప్రీంకోర్టు గత ఏడాది నవంబరు 7న తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. వీధికుక్కలను జనసమ్మర్థ ప్రదేశాల నుంచి తరలించి, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ (సంతానోత్పత్తి నియంత్రణ ఆపరేషన్లు) చేసి.. మళ్లీ వాటిని తెచ్చిన చోటే వదిలేయాలంటూ అంతకుముందు ఆగస్టులో ఇచ్చిన తీర్పును కూడా సుప్రీం ధర్మాసనం (తన నవంబరు 7నాటి తీర్పులో) సవరించుకుంది. వాటిని తెచ్చిన చోటే తిరిగి వదిలేయకుండా షెల్టర్లకే పరిమితం చేయాలని స్పష్టం చేసింది. ఆ తీర్పును ఉపసంహరించుకోవాలంటూ పలువురు జంతుప్రేమికులు, జంతు హక్కుల కార్యకర్తలు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వారు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన త్రిసభ్య ధర్మాసనం జనవరి 29న తీర్పును వాయిదా వేసింది.మంగళవారం.. ఆ పిటిషన్లను తోసిపుచ్చుతూ తీర్పునిచ్చింది. వీధి కుక్కల సంఖ్య పెరగకుండా అదుపు చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు సరిగ్గా ప్రయత్నించట్లేదని అభిప్రాయపడింది. వాటి నియంత్రణకు, ప్రజల భద్రతకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పలు ఆదేశాలు జారీ చేసింది. ప్రతి జిల్లాలోనూ కనీసం ఒక పూర్తిస్థాయి కార్యాచరణ కలిగిన యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఆ కేంద్రంలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు, శిక్షణ పొందిన సిబ్బంది, శస్త్రచికిత్స సౌకర్యాలు, రవాణా సౌకర్యాలు అన్నీ ఉండాలని స్పష్టం చేసింది. తమ ఆదేశాలను అమలుపరచకపోతే.. తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించింది. అలాగే, రేబిస్ బారిన పడిన, మనుషుల ప్రాణాలకు ముప్పు కలిగించే, నయం చేయడానికి వీలుకానంతగా జబ్బుపడ్డ వీధి కుక్కల కారుణ్య మరణానికి సుప్రీంకోర్టు తొలిసారి ఆమోదం తెలిపింది. వీధి కుక్కల జనాభా ఆందోళనకరస్థాయికి చేరుకున్న చోట్ల.. కుక్క కాటు ఘటనలు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాల్లో, ప్రమాదకరమైన కుక్కలను అధికారులు కారుణ్య మరణాలకు గురిచేయవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, పశువైద్య నిపుణుల నిర్ణయం తీసుకున్న తర్వాత మాత్రమే.. అది కూడా, జంతు హింస నిరోధక చట్టం 1960, యానిమల్ బర్త్ కంట్రోల్‌రూఊల్స్ 2023, ఇతరత్రా చట్టబద్ధమైన నిబంధనలకు కచ్చితంగా లోబడి మాత్రమే కారుణ్య మరణానికి గురిచేయవచ్చని వివరించిందినల్సార్ వర్సిటీ గురించి ప్రస్తావనతమ క్యాంపస్‌లో 'యానిమల్ లా సెంటర్'ను ఏర్పాటు చేయడం ద్వారా వర్సిటీప్రాంగణంలోని కుక్కల పట్ల దయతో వ్యవహరించేలా విద్యార్థులు, సిబ్బంది అందరికీ అవగాహన కల్పిస్తున్నామని, ఇలాంటి సామాజిక ప్రయోగాలను ఇతర విద్యాసంస్థల్లో కూడా చేపట్టవచ్చని నల్సార్ వర్సిటీ చేసిన వాదనను సుప్రీం కోర్టు తన తీర్పులో ప్రత్యేకంగా ప్రస్తావించింది. విశ్వవిద్యాలయ ప్రాంగణం పరిధిలో ఎవరైనా కుక్కకాటుకు గురైతే బాధితులకు జరిగిన నష్టానికి, హానికి సంబంధించి తామే పూర్తి చట్టపరమైన బాధ్యత తీసుకుంటామని వర్సిటీల్లోని జంతు సంరక్షణ బృందాలు వీసీలకు హామీ పత్రాన్ని సమర్పించాలని తేల్చి చెప్పింది. అలా చేయకపోతే సదరు సంస్థ ప్రాంగణంలో వీధికుక్కలను సాకడం, వాటికి ఆహారం అందించడం వంటి కార్యకలాపాలను ఆ సంస్థ అధిపతి అనుమతించకూడదని ఆదేశించింది. ఈ ఆదేశాన్ని పాటించడంలో విఫలమైతే సదరు అధిపతిపై చర్యలు తప్పవని హెచ్చరించింది. పాఠశాలలు, కాలేజీలు, ఆస్పత్రుల వంటి సంస్థాగత ప్రదేశాలకు వాటి స్వభావం రీత్యా అత్యున్నతస్థాయి భద్రతాప్రమాణాలు అవసరమని.. అటువంటి భద్రతను ప్రమాదంలో పడేసే అవకాశం ఉన్న ఎటువంటి చర్యకైనా బాధ్యతను స్వీకరించేవారు ఉండాలని తేల్చిచెప్పింది.

# 2 లక్షల మెట్రిక్ టన్నుల 'బాయిల్డ్ రైస్' సేకరణకు కేంద్రం అంగీకారం

న్యూఢిల్లీ బ్యూరో : రాష్ట్రం నుంచి 2 లక్షల మెట్రిక్ టన్నుల 'బాయిల్డ్ రైస్' సేకరణకు కేంద్రం అంగీకరించిందని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అలాగే దేశవ్యాప్తంగా ప్రజా పంపిణి వ్యవస్థ ద్వారా సరఫరా చేసే బియ్యంలో '10 శాతం నూకలు' (బ్రోకెన్ రైస్) విధానం అమలు చేసేందుకు కేంద్రం అంగీకరించిదన్నారు. మంగళవారం నాడిక్కడ కేంద్ర పౌరసపరాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో మంత్రి నాదెండ్ల మనోహర్ భేటీ అయ్యారు. అలాగే ఎఫ్‌సిఐ, కేంద్ర ప్రజా పంపిణీ, ఆహారశాఖ ఉన్నతాధికారులతో కూడా సమావేశమయ్యారు. అనంతరం ఎపి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మనోహర్ మాట్లాడారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి దేశవ్యాప్తంగా '10 శాతం నూకలు' విధానం అమలవుతుందని పేర్కొన్నారు.రాష్ట్రంలో వచ్చే ఖరీఫ్ పంటకు సన్నద్ధతపై చర్చించానని, పౌర సరఫరాల విభాగం ద్వారా బయటకు వెళ్లే ప్రతి



బియ్యం బస్తా సరఫరా క్రమాన్ని గుర్తించేలా చర్యలు చేపడతామని అన్నారు. అలాగే రక్షణ దళాలకు చెందిన అన్ని స్టోర్స్‌లో అరకు కాఫీ లభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# సుందరయ్య ఆశయ సాధనే లక్ష్యం

పెద్దారవీడు (మార్కాపురం జిల్లా) : పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనే లక్ష్యంగా పనిచేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ శాసనమండలి సభ్యులు కెఎస్.లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. మార్కాపురం జిల్లా పెద్దారవీడు మండలం సానికరం గ్రామంలో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నూతన భవన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. తెలుగు ప్రజల బాగోగులు గురించి విశాలాంధ్రలో ప్రజారాజ్యం అనే పుస్తకాన్ని సవివరంగా పుచ్చలపల్లి సుందరయ్య రాశారన్నారు. తెలుగు రాష్ట్రాలకు ఆ పుస్తకంలో సూచించిన విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపడితే అభివృద్ధితో పాటు ప్రజల అభివృద్ధి కూడా అద్భుతంగా ఉంటుందని వివరించారు. మార్కాపురం ప్రాంతంలో నిర్మితమవుతున్న వెలుగొండ ప్రాజెక్టు గురించి కూడా అప్పట్లో సుందరయ్య రచించిన పుస్తకాల్లో సూచించినట్లు తెలిపారు. సానికవరంలో నిర్మించిన పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం బహుముఖ కార్యక్రమాలకు నెలవుగా వర్ధిల్లాలని మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆకాంక్షించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి బాటలు వేసిన అమరుడైన గుంటక సత్యనారాయణరెడ్డి మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. జెవివి రాష్ట్ర శాఖ తరపున ఇక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వహణ కోసం రూ.లక్ష చెక్కును డి.ఎస్.పి డాక్టర్ యు.నాగరాజు, శ్రావణి హాస్పిటల్ అధినేత డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ నుంచి నిర్వాహకులు దొడ్డ సుబ్బారెడ్డి, గోపి దేశ మల్లయ్య, బొచ్చు శివ శంకరరెడ్డి, గుంటక యోగిరెడ్డి తదితరులు అందుకున్నారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వ సురేష్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వద్దుల వెంకట వీరారెడ్డి, పెద్దారవీడు ఎస్‌ఐ ఎం.సైదుబాబు, సిపిఎం మార్కాపురం జిల్లా కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# 13 ఏళ్ల న్యాయ పోరాట విజయం




అమరావతి : కానిస్టేబుల్ ఉద్యోగం కోసం గిరిజన యువకుడు 13 ఏళ్లుగా సాగించిన న్యాయ పోరాటానికి ఎట్టకేలకు ఫలితం దక్కింది. తనపై నమోదైన చిన్న కేసు విషయాన్ని అటెస్టేషన్ ఫారంలో వెల్లడించలేదన్న కారణంతో ఉద్యోగం నిరాకరించడం సరికాదని పేర్కొంటూ, ఆయనకు కానిస్టేబుల్ (సివిల్) పోస్టులో నియామకం ఇవ్వాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పేద, వెనుకబడిన తరగతులకు చెందిన యువత చేసిన చిన్న తప్పులను జీవితాంతం శిక్షగా మార్చకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. వెనుకబడిన యువతకు అవకాశాలు లేకపోతే వారు అసాంఘిక శక్తుల వైపు మళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ సుబేందు శమంతో ధర్మాసనం తీర్పు వెలువరించింది. పిటిషనర్ ఎంపికను రద్దు చేస్తూ 2011, 2014లో జారీ చేసిన మెమోలను రద్దు చేసింది. నాలుగు వారాల్లో పిటిషనర్‌ను కానిస్టేబుల్‌గా నియమించాలని, వేతనాలు, సీనియారిటీ, ఇతర సేవా ప్రయోజనాలు కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన గిరిజన యువకుడు దొడ్ల పెంచలయ్య 2008లో కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేశారు. రాత పరీక్ష, శారీరక పరీక్షల్లో అర్హత సాధించి తాత్కాలికంగా ఎంపికయ్యారు. అయితే, గ్రామ రాజకీయ విభేదాల నేపథ్యంలో 2010లో ఆయనపై కేసు నమోదైంది. ఆ కేసులో ఆయన 13వ నిందితుడిగా ఉన్నాడు. ఉద్యోగానికి సంబంధించిన అటెస్టేషన్ ఫారంలో తనపై కేసు లేదని పేర్కొన్నారు. ఆ తరువాత పూర్వచరిత్ర పరిశీలించడంతో ఆ కేసు విషయం బయటపడి ఆయన నియామకాన్ని రద్దు చేశారు. పెంచలయ్య 2013లో న్యాయ పోరాటం ప్రారంభించారు. ఇదే సమయంలో ఆయనపై నమోదైన కేసును కింది కోర్టు కొట్టివేసి నిర్దోషిగా ప్రకటించింది. అయినప్పటికీ ట్రిబ్యునల్, తరువాత సింగిల్ జడ్జి కూడా ఆయనకు వ్యతిరేకంగా తీర్పులిచ్చారు. చివరకు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. పిటిషనర్‌పై నమోదైనది హత్య, దోపిడీ, అత్యాచారం వంటి తీవ్రమైన నేరం కాదని, గ్రామంలో జరిగిన చిన్న ఘర్షణ కేసు మాత్రమేనని ధర్మాసనం పేర్కొంది. గ్రామీణ గిరిజన ప్రాంతానికి చెందిన యువకుడు ఉద్యోగం పోతుందనే భయంతోనే కేసు విషయం వెల్లడించలేదని, దీనిని దురుద్దేశపూర్వకంగా చూడలేమని స్పష్టం చేసింది. సమాచారం దాచిపెట్టిన ప్రతి సందర్భాన్ని ఆటోమేటిక్ అనర్హతగా పరిగణించరాదని సుప్రీంకోర్టు ఇప్పటికే చెప్పిందని గుర్తుచేసింది.

### మోడీ వ్యాఖ్యలకు నిరసనగా
# బంగారం షాపుల బంద్



: ''ఒక సంవత్సరం పాటు బంగారం కొన వద్దు' అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర వ్యాప్తంగా స్వర్ణకారులు, బంగారు దుకాణాల యజమానులు మంగళవారం నిరసన తెలిపారు. స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రెండవ ముంబయిగా పేరుగాంచిన కడప జిల్లా ప్రొద్దుటూరులో బంగారు వర్తకులు పూర్తిగా బంద్ పాటించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు అనంతపురం, రాయదుర్గం, కడప జిల్లాలోని మైదుకూరులలో కూడా బంగారం షాపులు పూర్తిగా మూతపడ్డాయి. మైదుకూరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. దుకాణాల యజమానులు స్వచ్ఛందంగా షాపులు మూసివేసి తమ నిరసన తెలిపారు. విజయవాడతో పాటు రాష్ట్రంలోని పలు ఇతర ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కొందరు వ్యాపారులు తమ దుకాణాల్లో బంగారానికి బదులు బెంగాల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మోడీ కొనుక్కుని తిన్న 'ఝల్‌మురి' విక్రయిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు తాలూకా స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు యు.ఇలియాస్ మాట్లాడుతూ... సంవత్సరం పాటు బంగారు కొనుగోలు చేయవద్దని ప్రధాని చెప్పడం సరికాదన్నారు. ప్రస్తుతం స్వర్ణకారుల పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనాతో ఒకసారి, నోట్ల మార్పిడితో మరోసారి, రేట్లు పెరుగుదలతో ఇంకోసారి స్వర్ణకారులు తీవ్రంగా నష్టపోయారన్నారు.ఈ రంగంపై ఆధారపడిన లక్షలాది కుటుంబాలు, ఆభరణాల తయారీ, పాలిషింగ్, డిజైనింగ్ కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.అనంతరం తహశీల్దార్ భాస్కర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. విజయవాడలో బంగారు దుకాణాలు మూసివేసిన స్వర్ణకారులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. స్వర్ణకారుల సంఘం నేతలు మాట్లాడుతూ, ఇప్పటికే అంతంతమాత్రంగానే జీవనోపాధి కొనసాగుతోందన్నారు. ఇటీవల భారీగా పెరుగుతున్న ధరలతో వినియోగదారులు కొనుగోళ్లు తగ్గించారని, దీంతో తయారీ పనులు పూర్తిగా దెబ్బతిన్నాయని చెప్పారు. సంవత్సరం పాటు బంగారం కొనొద్దని ప్రధానే చెబితే తమ కుటుంబాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. స్వర్ణకార కుటుంబాల జీవనోపాధి దెబ్బతినకుండా ప్రత్యేక ఆర్థిక నిధులు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. స్వర్ణకారులకు సంక్షేమ పథకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అధికారులకు అందజేశారు.

## సేవా తత్పరతకు ప్రతీకలు
## సమాజ సేవలో అగ్రగాములు ఆర్యవైశ్యులు



ప్రజాస్వామ్యం ,విజయనగరం : న్యాయబద్ధమైన వ్యాపారం మార్గంగా ఎంచుకొని సేవా తత్పరతకు ప్రతీకలుగా సమాజ సేవలో అగ్రగాములుగా ఆర్యవై శ్యులు ఉన్నారని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పేర్కొన్నారు .ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ విజయనగరం జిల్లా మహిళా విభాగ ప్రమాణ స్వీకా రానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ న్యాయమైన వ్యాపా రంతో సంపదను సృష్టించి, ఆ సంపదను సమాజ శ్రేయస్సు కోసం అన్నదానాలు, విద్యాదానాల రూపంలో తిరిగి ఇచ్చే గొప్ప గుణం ఒక్క ఆర్యవైశ్యులకే సొంతం అని ఎక్కడ ఆకలి కేకలు వినిపిం చినా, అక్కడ 'అన్నసత్రం' ఏర్పాటు చేసి ఆకలి తీర్చే కరుణా మ యులు ఆర్యవైశ్యులని. వారి సేవాతత్పరత సమాజానికి నిరంతర వెలుగు అని అభివర్ణించారు .ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కే జయశ్రీ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వ లనం చేసి మాట్లాడుతూ "ధర్మ రక్షణ కోసం, ఆత్మగౌరవం కోసం అగ్ని ప్రవేశం చేసిన అమరమాత శ్రీ వాసవీ కన్యకా పరమే శ్వరి వారసులుగా... సమాజ హితమే తమ హితంగా భావించే వారే ఆర్యవైశ్యులు అని అన్నారు . జిల్లా మహిళా విభాగం అధ్య క్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన సముద్రాల గిరిజ ప్రసన్న మాట్లాడుతూ శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అడుగుజాడల్లో నడు స్తూ... శాంతి, అహింస, సత్యం మరియు సన్మార్గాన్ని తమ జీవిత విధానంగా మార్చుకున్న ధన్యజీవులు ఆర్యవైశ్యులు అని, మాటలో మర్యాద, చేతలో నిజాయితీ, వ్యాపారంలో నైపుణ్యం చూపిస్తూ... దేశ ఆర్థిక ప్రగతికి తమదైన శైలిలో వెన్నుముకగా నిలిచే శ్రమ జీవులు ఆర్య వైశ్యులు అని పేర్కొన్నారు .ముందుగా విజయ నగరం మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తో కలిసి జయశ్రీ మహిళా విభాగంతో ప్రమాణ స్వీకారం చేయించారు .అధ్యక్షురాలుగా సముద్రాల గిరిజా ప్రసన్న ,కార్యద ర్శిగా సంధ్య భారతి ,కోశాధికారిగా గుడిసె దివ్య ,యువజన విభాగం అధ్యక్షులుగా వి కిరణ్ కుమార్ ,కార్యదర్శిగా కే సాయి కిషోర్ ,కోశాధికారిగా గ్రంధి కుమార్ రాజా బాధ్యతలు స్వీకరించారు .అధికార ప్రతినిధి ఉప్పల ఈశ్వరరావు నేతృత్వంలో ,జిల్లా సంఘం అధ్యక్ష కార్యదర్శులు బోండా రమేష్ ,గుడిసె బాలకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా పండుగ వాతావర ణంలో నిర్వహించారు .ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా సంఘం జిల్లా శాఖ ప్రధాన సలహాదాజిల్లా శాఖ ప్రధాన సలహా దారు సముద్రాల గురు ప్రసాద్ వ్యవహరించారు .ఈ సమావేశంలో సంఘం ఉత్తరాంధ్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పలుకూరి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడీ నియామకాల్లో పారదర్శకతకు జిల్లా యంత్రాంగం కట్టుబాటు

**మధ్యవర్తులను నమ్మొద్దని అభ్యర్థులకు సూచన-ఐసిడిఎస్ పిడి కనకదుర్గ**

ప్రజాస్వామ్యం/పార్వతీపురం, మే 19: పార్వతీపురం మన్యం జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు మరియు అంగన్వాడీ సహాయకుల నియామకాలను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలు మెరిట్ ఆధారంగా పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు పీడీ, ఐసీడీఎస్ కనకదుర్గ తెలిపారు.నియామకాల విషయంలో ఎటువంటి రాజకీయ జోక్యం, మధ్యవర్తిత్వం లేదా అవకతవకలకు అవకాశం లేదని స్పష్టం చేశారు. కొంతమంది వ్యక్తులు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి అభ్యర్థులను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం అందుతోందని, అలాంటి వారి మాటలను నమ్మవద్దని అభ్యర్థులకు సూచించారు.అంగన్వాడీ ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేయడం పూర్తిగా చట్ట విరుద్ధమని హెచ్చరించారు. ఇటువంటి ఘటనలు ఎవరి దృష్టికి వచ్చినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందిం చాలని కోరారు.అంగన్వాడీ నియామకాలు పూర్తిగా అర్హతలు, రోస్టర్ విధానం, స్థానికత మరియు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే చేపట్టబడతాయని పేర్కొన్నారు. అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్లు ప్రకటనలను మాత్రమే విశ్వసిం చాలని సూచిం చారుజిల్లా యంత్రాంగం నియామకాల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉందని పీడీ, ఐసీడీఎస్ వెల్లడించారు.

## సుందరయ్య ఆశయ సాధనకు కృషి

**వర్ధంతి సభలో గంగారావు**




తగరపువలస ప్రజాస్వామ్యం :సుందరయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సి పి ఎం జిల్లా నాయకులు డా బి గంగారావు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారుస్థానిక సి ఐ టి యు కార్యాలయం వద్ద మంగళవారం సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయన నిజాయితీ ,నిరాడంబరత, పోరాట పటిమ ఎంతో గొప్పవని కొనియాడారు. ఈ కార్యక్రమం లో పార్టీ స్థానిక నాయకులు ఎస్ అప్పల నాయుడు, రవ్వ నరసింగరావు,పంపాన సూర్య నారాయణ,కె రాము,ప్రజాశక్తి బాధ్యులు టి అప్పలరాజు, సి ఐ టి యు నాయకులు డి బాబాజీ, నీలాతి రాము తదితరులు పాల్గొన్నారు

# గంజాయి నియంత్రణలో భాగంగా తనిఖీలు

**డిఎస్పి - ఆర్.గోవిందరావు సి.ఐ - ఎస్ .సన్యాసినాయుడు**





ప్రజాస్వామ్యం /గజపతినగరం: జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు , బొబ్బిలి డిఎస్పి ఆర్ గోవిందరావు ఆధ్వర్యంలో గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ . సన్యాసినాయుడు పర్యవేక్షణలో మంగళవారం నాడు తనిఖీలు



చేపట్టినట్లు గజపతినగరం ఎస్సై కె.కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు . ఈ తనిఖీలలో భాగంగా రాయగడ – గుంటూరు ఎక్స్ప్రెస్ ట్రైన్ లో డిఎస్పి ఆర్. గోవిందరావు, సి.ఐ ఎస్ .సన్యాసినాయుడు ,సర్కిల్ సబ్ ఇన్స్పెక్టర్లు గజపతినగరం ఎస్.ఐ కె కిరణ్ కుమార్ నాయుడు, బొండపల్లి సబ్ ఇన్స్పెక్టర్ యు .మహేష్ , ఆంధ్ర ఎస్సై సీతారాం ,స్టేషన్ బూర్జవలస ఎస్.ఐ రాజేష్ , 60 మంది పోలీస్ సిబ్బందితో గంజాయి నియంత్రణలో భాగంగా ట్రైన్ లో తనిఖీలు చేపట్టడం జరిగిందని గజపతినగరం ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు.ఎవరైనా ట్రైన్లలో గంజాయి రవాణా చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిఎస్పి ఆర్.గోవిందరావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ .సన్యాసినాయుడు హెచ్చరించారు. ఎవరైనా గంజాయి విక్రయించిన, కొనుగోలు– అమ్మకాలు చేసిన అటువంటి వారికి కఠినమైన జైలు శిక్షలు పడతాయని వారిరువురూ హెచ్చరించారు .గంజాయి కి బానిసలై యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని డిఎస్పి, సర్కిల్ ఇన్స్పెక్టర్ ,సబ్ ఇన్స్పెక్టర్లు యువతకు సూచనలు చేశారు.ఈ గంజాయి తనిఖీలలో ఈగల్ టీం , డాగ్ స్క్వాడ్ ,జిఆర్పి బృందాలు పాల్గొనడం జరిగిందని గజపతినగరం ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు అన్నారు.

## వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియ వేగవంతం చెయ్యండి

**---తిరస్కరణ మ్యుటేషన్లకు గ్రామసభలో కారణాలు వివరించాలి జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ - సేదు మాధవన్**

ప్రజాస్వామ్యం / విజయనగరం : జిల్లాలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలకు చేపట్టిన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సేదు మాధవన్ రెవెన్యూ అధికారు లను ఆదేశించారు. వివిధ ప్రాజెక్టులు కు భూసేకరణకు సంబంధించి కలెక్టరేట్ నుండి మంగళ వారం వర్చువల్ గా సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ సంబంధించిన ఇంకనూ సమకూ ర్చవలసిన భూ సేకరణ పై సమీక్షించారు. ట్రైబల్ యూనివర్సిటీ కి విద్యుత్ స్థాపన ఏర్పాట్లు పై సూచిస్తూ ఆ ప్రాంతంలో ఉన్న ఎలక్ట్రికల్ టవర్లు తక్షణం తీయవలసిన అవసరముందని అదేవిధంగా కొత్త గా హెచ్ టి లైన్లు వేయుటకు అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. భూసేకరణ అనంతరం ఆర్థిక అనుమతులు వచ్చిన వెంటనే బిల్స్ అప్లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారుతారకరామ తీర్థసాగర్, తోటపల్లి ప్రాజెక్టులు , జాతీయ రహదారులు, మూడో రైల్వే లైన్, కొత్తవ లస– విజయనగరం నాలుగో రైల్వేలైన్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తదితర ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్షించారు. ప్రాజెక్టుల వారీగా పనుల ప్రస్తుత పరిస్థితిని సమీక్ష చేశారు. శాఖాధికారులు క్షేత్ర స్థాయి లో పరిశీలించిన తర్వాతే బడ్జెట్ అంచనా వేయాలన్నారు. వివిధ దశలలో గల భూ సేకరణ ప్రక్రియలను నిర్ణీత గడువు లోగా పూర్తిచేసి, ప్రాజెక్టులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేయాలన్నారు.జాతీయ రహదార్ల విస్తరణ నిమిత్తం సుమారు ఎనభై ఎకరాలకు రెవిన్యూ శాఖ అనుమతులు అదేవిధంగా స్ట్రక్చర్ల అంచనాలకు ఆర్ అండ్ బి శాఖ అధికారులు ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించారు. సంబంధిత భూ



లావాదేవీలలో కోర్టులో ఉన్న కేసుల పరిష్కారానికి కృషిచేయాలని రెవిన్యూ అధికారులను కోరారు.భూ సేకరణ పూర్తయిన వాటికి బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలని తెలిపారు. అవార్డ్ కు సిద్ధంగా ఉన్నవాటికి అవార్డ్స్ పాస్ చేయాలన్నారు. భూసేకరణ పనులన్నింటికి ప్రాధాన్యత నిచ్చి పూర్తి చేయాలన్నారు తిరస్కరణ మ్యుటేషన్లకు గ్రామసభలో కారణాలు వివరించా జిల్లాలో పెండింగ్ మ్యుటేషన్లను వెంటనే పరిష్కరించాలని ఇంచార్జ్ కలెక్టర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, సర్వేయర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో తిరస్కరణలకు గురైన మ్యుటేషన్లు కోసం గ్రామసభలు పెట్టి తిరస్కరణకు గల కారణాలను వివరించాలని అన్నారు. వంగర, చీపురుపల్లి, భోగాపురం, డెంకాడ, కొత్తవలస, గంట్యాడ మండలాల తహసీల్దార్లతో మాట్లాడుతూ ఎక్కువ మొత్తంలో మ్యుటేషన్లు పెండింగు కు గల కారణాలు అడుగుతూ తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కరించిన మ్యుటేషన్లను సకాలంలో డిస్పోజల్ చేయాలని అన్నారు. ఇకనుండి ప్రతి రోజూ సమీక్ష నిర్వహించబడుతుందని హెచ్చరించారుఈ సమావేశంలో డిఆర్ఓ సత్తిబాబు, ఆర్డీవోలు సుధాసాగర్ , రామ్మోహన్, సుధారాణి , సర్వే ఎడి , తహశీల్దార్లు, సర్వేయర్లు , ఇరిగేషన్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## రీసర్వేలో పార్వతీపురం మన్యం జిల్లా ముందంజ




ప్రజాస్వామ్యం/?పార్వతీపురం, మే 19 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వేలో పార్వతీపురం మన్యం జిల్లా ముందంజలో ఉందని సిసిఎల్ఎ జి. జయలక్ష్మి కితాబిచ్చారు. రాష్ట్రంలో భూ రికార్డులు, పట్టాదారు పాస్ పుస్తకాలు, ఖాతాల సవరణ పురోగతిపై సిసిఎల్ఎ అమరావతి నుండి మంగళవారం జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ డా ఎన్.ప్రభాకర రెడ్డి, జాయింట్ కలెక్టర్ సి.యస్వంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. డిజిటల్ కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో జిల్లాల వారీగా ఉన్న మొత్తం గ్రామాలు, ఖాతాల సంఖ్య, ముద్రణకు సిద్ధంగా ఉన్న రికార్డులు మరియు పెండింగ్‌లో ఉన్న సమస్యలపై సమగ్రంగా చర్చించారు. ?భూ రికార్డుల ముద్రణ ప్రక్రియలో రాష్ట్రంలోనే రెండవ స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా 94.71% తో నిలిచి అత్యుత్తమ ప్రతిభను కనబరిచిందన్నారు. ఈ జిల్లా ముద్రణ ప్రక్రియలో వేగంగా దూసుకుపోతున్నాయన్నారు. ?వెనుకబడిన జిల్లాలు పనులు పురోగతికి ప్రణాళికలు చేసుకొని వేగవంతం చేయాలన్నారు. ?రికార్డులు ఇంకా పూర్తి స్థాయిలో ముద్రణకు సిద్ధం కాకపోవడానికి గల ప్రధాన కారణాలను విశ్లేషించారు. రాష్ట్రవ్యాప్తంగా? 80తం కంటే ఎక్కువ పురోగతి సాధించిన 346 గ్రామాల్లో త్వరితగతిన ముద్రణ పూర్తి చేయాలని, అలాగే 60 నుండి 80 శాతం మధ్యలో ఉన్న 133 గ్రామాల్లోని లోపాలను వెంటనే సరిదిద్ది రికార్డులను ముద్రణకు అనుకూలంగా మార్చాలని కలెక్టర్లను ఆదేశించారు. పెండింగ్ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాస్ పుస్తకాలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు.ఈ వీడియో సమావేశంలో పార్వతీపురం, పాలకొండ ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## టి. నగరపాలెం గ్రామంలో యల్లారమ్మ తల్లిని దర్శించుకున్న సిరమ్మ

భీమునిపట్నం ప్రజాస్వామ్యం , భీమిలి మండలంలోని టి. నగరపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ యల్లారమ్మ తల్లి గ్రామ దేవత పండుగ మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది ఈ ఉత్సవంలో ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైయస్సార్సీపి జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ పాల్గొన్నారు ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు గ్రామస్తులు, భక్తుల కోలాహలం మధ్య ఆలయానికి చేరుకున్న సిరమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తి గీతాలతో, అమ్మవారి నామస్మరణతో మారుమోగింది.ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవమైన శ్రీ శ్రీ శ్రీ యల్లారమ్మ తల్లి గ్రామ దేవత పండుగను కళ్లారా వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు భారీ



సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఈ.సీ. నెంబర్ దాట్ల పెదబాబు టి. నగరపాలెం గ్రామ మాజీ సర్పంచ్ పొట్నూరు చంద్రశేఖర్ ఎంపీటీసీ స్థానిక ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు ముఖ్య నాయకులు, కార్యకర్తలు చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు

## తీవ్ర ఎండలపై అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర్ రెడ్డి**



ప్రజాస్వామ్యం/పార్వతీపురం, మే 19: పార్వతీపురం మన్యం జిల్లాలో రాబోయే ఐదు రోజుల పాటు ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర్ రెడ్డి సూచించారు. వాతావరణ శాఖ రియల్ టైమ్ గవర్నెన్స్ విభాగం నివేదికల ప్రకారం జిల్లాలోని పలు మండలాలు 'డేంజర్ కేటగిరీ'లోకి వెళ్లే అవకాశం ఉందన్నారు.జిల్లాలో 41 డిగ్రీల సెల్సియస్ నుండి 54 డిగ్రీల సెల్సియస్ వరకు హీట్ ఇండెక్స్ నమోదయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ముఖ్యంగా కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతానగరం, సాలూరు, పాచిపెంట, మక్కువ, సీతంపేట, భామిని, కొమరాడ, వీరఘట్టం, బలిజిపేట, జియ్యమ్మవలస, పార్వతీపురం, గరుగుబిల్లి మరియు పాలకొండ మండలాల ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా మధ్యాహ్న సమయంలో అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు.ప్రజలు తరచూ మంచినీరు, ఓఆర్ఎస్ ద్రావణం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని, వృద్ధులు, చిన్నపిల్లలు గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర్ రెడ్డి సూచించారు. జిల్లా యంత్రాంగం అన్ని అవసరమైన చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు.

## ఆంధ్రజ్యోతి విలేకరి చిట్టూరి రవణ గారిని పరామర్శించిన మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర



ప్రజాస్వామ్యం/ పాచిపెంట

మే 19:పాచిపెంట మండలానికి చెందిన స్థానిక ఆంధ్రజ్యోతి విలేకరి చిట్టూరి.రవణ గారు గత కొద్దిరోజులుగా పెరాలసిస్ వ్యాధితో బాధపడుతూ విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ప్రస్తుతం పాచిపెంటలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు.ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక.రాజన్నదొర గారు ఈరోజు పాచిపెంటకు వెళ్లి ఆంధ్రజ్యోతి రిపోర్టర్ రవణ గారిని పరామర్శించారు.ఆయన ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులను వివరాలు అడిగి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.అలాగే వైద్యుల సూచనలు తప్పకుండా పాటించాలని, పూర్తి విశ్రాంతి తీసుకోవాలని రవణ గారికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల, వైయస్సార్ సిపి మండల అధ్యక్షులు గొట్టాపు ముత్యాల నాయుడు, స్థానిక నాయకులు,కార్యకర్తలు మరియు తోటి పాత్రికేయ మిత్రులు పరామర్శించడం జరిగింది.

# సమస్యలపై 'బర్డ్ ఐ వ్యూ' కలిగి ఉండాలి

**-రెవిన్యూ అధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి- రీసర్వే కేసుల పరిష్కారంలో, ఈ-కేవైసీ ప్రక్రియలో జాప్యం వద్దు- డిఎల్ఆర్ తర్వాత మ్యుటేషన్లు జరిగితే సహించేది లేదు ఫేజ్-5 రీసర్వేలో అలసత్వం వద్దు- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**




ప్రజాస్వామ్యం/పార్వతీపురం, మే 19 : రెవిన్యూ అధికారులు తమ రోజువారీ విధుల్లో కేవలం ఒక ఫైలుకో, ఒక గ్రామానికో పరిమితం కాకుండా, మండలం జిల్లా వ్యాప్తంగా జరుగు తున్న పనులపై 'బర్డ్ ఐ వ్యూ' (సమగ్ర అవగాహన) కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, రెవిన్యూ అధికారులతో పి.పి.పి ఈ-కేవైసీ, డి.ఎల్.ఆర్ మరియు ఎల్.సి.సి పెండింగ్ అంశాలపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. డిఎల్ఆర్ మ్యుటేషన్లలో నిర్లక్ష్యం వద్దు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డిఎల్ఆర్ ప్రక్రియ ముగిసిన తర్వాత కూడా మ్యుటేషన్లు పెండింగ్‌లో ఉండరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. మ్యుటేషన్లు పెండింగ్‌లో ఉండటం సరికాదని, ఫేజ్-5లో మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వాన్ని సహించబోమని అన్నారు. డిఎల్ఆర్ ముగిసిన తర్వాత కూడా మ్యుటేషన్లు పెండింగ్‌లో ఉన్నట్లు తేలితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.సమావేశంలో అధికారుల పనితీరును ప్రస్తావిస్తూ.. కొందరు అధికారుల ప్రగతి బాగా ఉన్నప్పటికీ, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయని వారిపై చర్యలు ఉంటాయని అన్నారు. ఈ-కేవైసీ పనుల్లో వేగం పెంచాలిజిల్లా వ్యాప్తంగా ఇంకా పెండింగ్‌లో ఉన్న 56 గ్రామాల ఈ-కేవైసీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మరణించిన వారి వివరాల నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియను ఒక నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఏకకాలంలో ప్రారంభించాలన్నారు. గడువుల గురించి కాకుండా, క్షేత్రస్థాయిలో విఆర్ఓలను సమన్వయం చేసుకుంటూ పెండింగ్ ఖాతాల వారీగా జాబితాను సిద్ధం చేసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. మండలాల్లో పెండింగ్ వివరాలను సిద్ధం చేసుకొని, రికార్డులను కార్యాలయంలోనే కాకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ప్రజా భాగస్వామ్యంతో బరువు తగ్గించుకోండిప్రభుత్వ పనుల్లో ప్రజా భాగస్వామ్యాన్ని పెంచాలని కలెక్టర్ అధికారులకు పిలుపునిచ్చారు. భూమి రికార్డులకు సంబంధించి ముందు కాపీలను డోర్-టు-డోర్ పంపిణీ చేయాలన్నారు. అందులో పేరు, ఖాతా సంఖ్య తదితర వివరాలను సరిచూసుకోవడానికి ఒక స్టాండర్డ్ ఫార్మాట్ (ప్రశ్నావళి) రూపొందించి ప్రజలకే ఇవ్వాలని సూచించారు. తప్పులుంటే వాటిని సరిచేసి, గుర్తింపు కార్డుల నకలు జతచేసి తిరిగి ఇచ్చే బాధ్యతను ప్రజలకే అప్పగించడం ద్వారా రెవిన్యూ సిబ్బందిపై 10 శాతం భారం తగ్గుతుందని, పనుల పారదర్శకంగా జరుగుతాయని వివరించారు.ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు మరియు ఇతర రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ వస్తేనే తెలుగు దేశం పార్టీకి మళ్ళీ భవిష్యత్తు

**- నారా లోకేష్ కి మించిన జనాదరణ ఎన్టీఆర్ కి ఉంది - అత్యధిక శాతం మంది అభిప్రాయం కూడా ఇదే**

**- గూగుల్ డేటా సెంటర్ తో ప్రయోజనం లేదు - తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ కీలక వ్యాఖ్యలు**



విశాఖపట్నం : ప్రజాస్వామ్యం తెలుగు దేశం పార్టీ 2029 లో కూడా మళ్లీ అధికారంలోకి రావాలంటే పార్టీకి జూనియర్ ఎన్టీఆర్ అవసరం తప్పనిసరి అని .. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ వ్యాఖ్యానించారు. ఈనెల 20వ తేదీన ఎన్టీఆర్ జన్మదినం నేపథ్యంలో బి.వి.రామ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మంగళవారం ఉదయం దాబాగార్డెన్స్ లోని వీజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం అన్న నందమూరి తారక రామారావు తెలుగు దేశం పార్టీని స్థాపించారన్నారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా పని చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. ఇదే క్రమంలో ఆయన కుమార్తె పురందరేశ్వరి, నందమూరి హరికృష్ణ తండ్రి వారసత్వాన్ని అనుసరించగలిగారన్నారు. అయితే పురందరేశ్వరి ప్రస్తుతం భారతీయ జనతా పార్టీలో కొనసాగుతుండగా.. హరికృష్ణ దురదృష్టవశాత్తు, ఈ లోకం నుంచి దూరమయ్యారని ప్రస్తావించారు. నందమూరి బాలకృష్ణ తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నప్పటికీ తండ్రి మార్కును ఆయన సొంతం చేసుకోలేకపోయారన్నారు. ఈ పరిస్థితులలో యువతరం నాయకత్వం తెర పైకి రావాల్సిన అవసరం ఉందని రామ్ ప్రస్తావించారు. ఇటు మన రాష్ట్రంలో లోకేష్, పవన్ కళ్యాణ్, పొరుగున ఉన్న తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ ఇదే కోవలోకి వస్తారన్నారు ఎన్టీఆర్ వారసుడు ఎవరు ?అయితే నాటి ఎన్టీఆర్ వారసుడు ఎవరు అనే ప్రస్తావనకు వచ్చేసరికి ప్రశ్నార్థకం మాత్రమే కనిపిస్తుందన్నారు. ఈ పరిస్థితులలో నాటి నందమూరి తారక రామారావు పేరుతో పాటు అంతటి ప్రజాదరణ కలిగిన వ్యక్తి జూనియర్ ఎన్టీఆర్ అని తను భావిస్తున్నానన్నారు. తన అభిప్రాయంతో తెలుగు ప్రజలు కూడా ఏకీభవిస్తారని.. అత్యధిక శాతం మంది అభిప్రాయం కూడా ఇదే అవుతుందనే నమ్మకం తనకు ఉందన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఎందుకంటే నాడు నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగు దేశం పార్టీ 2029 లో కూడా మళ్లీ అధికారంలోకి రావాలంటే పార్టీకి జూనియర్ ఎన్టీఆర్ అవసరం తప్పనిసరి అని బి.వి.రామ్ వ్యాఖ్యానించారు. ఇదే క్రమంలో 2029 ఎన్నికలకు మరో మూడేళ్ల వ్యవధి ఉన్నప్పటికీ... ఇప్పటి నుంచే జూనియర్ ఎన్టీఆర్ ప్రత్యక్ష రాజకీయాల వైపు అడుగుల వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటి నుంచే ఆ ప్రయత్నం మొదలుపెడితే 2029 ఎన్నికల నాటికి తెలుగు దేశం పార్టీ ఆంధ్రప్రదేశ్లో అత్యంత బలమైన పార్టీగా అవతరిస్తుందన్నారు గూగుల్ డేటా సెంటర్ తో ప్రయోజనం లేదు విశాఖపట్నంకి గూగుల్ డేటా సెంటర్ వస్తే పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారని.. కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇంటెలిజెన్స్ చీఫ్ గా పని చేసిన రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ ఏ.బి.వెంకటేశ్వరరావు అంచనా ప్రకారం 500 ఉద్యోగాలకు మించి రావన్నారు. ఈ పరిస్థితులలో గూగుల్ డేటా సెంటర్ వల్ల నిజంగా లక్షలాది ఉద్యోగాలు వస్తాయనే నమ్మకం ఉంటే అదే అంశంపై ఈ నెల 17న చర్చకు రావాలని సవాల్ చేసానన్నారు. అయితే నారా లోకేష్ స్పందించకపోవడం వల్ల గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు చేసినా.. 500కి మించి ఉద్యోగాలు రావని సులువుగా అర్థమవుతుంది అన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఎంతో విలువైన భూములను ఎకరా 99 పైసలు చొప్పున దారాదత్తం చేయాల్సిన అవసరం ఏముందని, 27 వేల కోట్ల రూపాయల ప్రభుత్వ సబ్సిడీ ఎందుకోసం అని బి.వి.రామ్ ప్రశ్నించారు చంద్రబాబుకు ధన్యవాదాలు మహానాడును తక్కువ ఖర్చుతో హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలనే నిర్ణయం తీసుకున్న తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ను తాను అభినందిస్తున్నానని తెలిపారు. ఇంధన సంక్షోభం నేపథ్యంలో తెలుగు దేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాల్సిన మహానాడు ను రద్దు చేయాలని తెలుగు శక్తి అంతకుముందే డిమాండ్ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఏది ఏమైనప్పటికీ తెలుగు ప్రజల క్షేమం కోసం పార్టీలతో సంబంధం లేకుండా తెలుగు శక్తి పోరాటం చేస్తుందన్నారు.విలేకరుల సమావేశంలో డాక్టర్ పప్పూర్ నికుంజ్, పెద్దాడ రమణ, పెంటకోట త్రినాధ రావు, సన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా రాజకీయాలకు
## నిలువెత్తు నిదర్శనం సుందరయ్య -

అమరావతి : ప్రజా రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు అన్నారు. సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా విజయవాడలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జె జయరాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వై వెంకటేశ్వరరావు మాట్లాడారు. సిపిఎం అగ్రనేతగా సుందరయ్య నిరంతరం ప్రజల మధ్యే పనిచేశారన్నారు. చిన్న వయసులోనే ప్రజా సమస్యలపై అధ్యయనం చేయడంతోపాటు కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. కమ్యూనిస్టు నాయకుడిగా నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలు అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి పోరాడారని వివరించారు. దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతగా, తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకుడిగా అనన్య సామాన్యమైన కృషి చేశారని పేర్కొన్నారు. అప్పట్లోనే సైకిల్ పై పార్లమెంటుకు వెళ్లి నిరాడంబర జీవితాన్ని గడిపారని వివరించారు. కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన ఒడిదుడుకులను ఎదుర్కొనే సమయంలో సైద్ధాంతికంగా ఆయన నిర్వహించిన పాత్ర అత్యంత స్ఫూర్తిదాయకమని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణం, సిద్ధాంత ఆచరణ, సేవాతత్పరతకు సుందరయ్య నిజమైన నిదర్శనమని పేర్కొన్నారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పేవారని, శత్రువులను ఎదుర్కోవడంలో ఆయనకు ఆయనే సాటని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడంతోపాటు, దేశంలో పేదలు, శ్రామికులు, కార్మికుల సమస్యలపై పోరాటంలో, అధ్యయనం చేయడంలో సుందరయ్య నిర్వహించిన పాత్ర మరువలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎవి నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆంధ్ర మాల్యాద్రి, యువి రామరాజు, ఎంబివికె బాధ్యులు తులసీరావు, స్వరూపరాణి, డివైఎఫ్ఐ నాయకులు రామన్న, రాము, సిఐటియు నాయకులు ఆర్వి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా
# మహిళాభివృద్ధి అధికారిణి



భీమునిపట్నం ప్రజాస్వామ్యం భీమిలి మండలం ఐసిడిఎస్ భీమిలి ప్రాజెక్ట్ పరిధిలో గల రామన్నపేట ఎగువపేట -1 ఎగువపేట -2 తోటవీధి అంగన్వాడి కేంద్రాలను జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశుసంక్షేమ సాధికారిత అధికారిణి కె.వి.రామలక్ష్మి సందర్శించారు ప్రాజెక్టు పరిధిలో ఉన్న గర్భిణీలకు బాలింతలకు తల్లులకు బాలల హక్కు, హెల్ప్ లైన్ నంబర్స్, చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ ఆ పోక్సో యాక్ట్ మొదలగు విషయలపై అవగాహన కల్పించారు అలాగే పోక్సో చట్టంలో గుడ్ టచ్ ఆ బాడ్ టచ్, కిశోరివికాశం తదితర విషయాలు గురించి తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్-భీమిలి, సి.డి.పి.ఓ., యం.శ్రీదేవి సెక్టార్ సూపర్వైజర్స్ నాగమణి అనిత మరియు అంగన్వాడీ కార్యకర్తలు, మదర్స్ పాల్గొన్నారు.

## నూకాలమ్మ బోర్డు ట్రస్ట్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన చురకల రమణ

**-ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు- ఎమ్మెల్యేను సత్కరించిన అశోక్ చక్రవర్తి**

భీమునిపట్నం,ప్రజాస్వామ్యం భీమిలి నియోజకవర్గం 3వ వార్డులోని శ్రీ శ్రీ శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు హాజరయ్యారు 2వ వార్డు టీడీపీ నాయకుడు చెట్టి అశోక్ చక్రవర్తి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్గా ప్రమాణ స్వీకారం చేసిన చురకల రమణకు అశోక్ చక్రవర్తి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో భీమిలి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# నూకాలమ్మ అమ్మవారి ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం



భీమునిపట్నం ప్రజాస్వామ్యం భీమిలి, నూకాలమ్మ అమ్మవారి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులతో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం ప్రమాణ స్వీకారం చేయించారు. విశాఖలో సింహాచలం, కనక మహాలక్ష్మి అమ్మవారి తర్వాత అంతటి ప్రాముఖ్యం గల భీమిలి నూకాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. చురకల రమణ, బర్రి రాజు, కుప్పిలి దుర్గ, రామాయణం రాజ్యలక్ష్మి, గుసివాడ ప్రవల్లిక, గరికిన సత్యం, నక్కెళ్ళ వెంకటేశ్వరరావు, దౌలపల్లి త్రినాథరావులను సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం, వారి అభిప్రాయం తీసుకుని చురకల రమణను చైర్మన్ గా సభా ముఖంగా గంటా ప్రకటించారు. అంతకు ముందు గంటా నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పంచకర్ల సందీప్, కురుమిన రామస్వామి నాయుడు, కైలాష్ రెడ్డి, కె. రామానాయుడు, గాడు వెంకటప్పడు, చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర, కనకల అప్పలనాయుడు, సరగడ అప్పారావు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, కొప్పల రమేష్, దండి వెంకటేష్, శాఖారి శ్రీనివాస్, వై.అనిల్ ప్రసాద్, గరే గుర్నాథ్, బోని ప్రసాద్, పీవీ నరసింహం, కాకర రమణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాసేవకు జీవితాన్ని
## అంకితం చేసిన 'పుచ్చలపల్లి'

కర్నూలు కార్పొరేషన్ : జీవితం మొత్తం ప్రజాసేవకు అంకితం చేసిన గొప్ప వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని మాజీ ఎమ్మెల్యే ఎం.ఏ.గఫూర్ కొనియాడారు. పేదలు, కార్మికులు నివసించే కర్నూలు నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలో ప్రజా సంఘాల భవన నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. కర్నూలులోని వీకర్ సెక్షన్ కాలనీ సెంటర్ లో ప్రజా సంఘాల భవన (సిఐటియు, డివైఎఫ్ఐ, ఐద్వా, కెవిపిఎస్) నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. అంతకుముందు ప్రజా సంఘాల భవన నిర్మాణ కమిటీ కన్వీనర్ ఎస్.అలివేలు అధ్యక్షతన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. గఫూర్ మాట్లాడుతూ.. ఈ భవన నిర్మాణం వీలైనంత త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. స్వాతంత్ర్యం కోసం సుందరయ్య పోరాటం చేశారని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆ ఫలాలు కార్మికులు, కర్షకులకు అందాలని నిరంతరం పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆయన జీవితం మొత్తం ప్రజాసేవకు అంకితం చేశారని, కష్టజీవులకు అండగా ఉండాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) నిర్మాణానికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. సుందరయ్య జీవితంలో ముఖ్యమైన పాత్ర సేవ చేయడం కాబట్టి ప్రజాసంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి కష్టాలను తొలగించడానికి కృషి చేయాలని, సేవా కార్యక్రమాలను విస్తృతంగా ప్రజలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, నగర కార్యదర్శి రాముడు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, ఐద్వా జిల్లా కార్యదర్శి అరుణ తదితరులు పాల్గొన్నారు.

EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET-PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022